క్లుప్తంగా

ఎస్‌డీపీఐ నూతన కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గం

నంద్యాల(వ్యవసాయం): ఎస్‌డీపీఐ నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం స్థానిక కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మణిహారం హనీఫ్, వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్‌కలాం, ప్రధాన కార్యదర్శులుగా ఏజెస్ హుసేన్, అమీర్ ముల్లా, కోశాధికారిగా షమీవుల్లాఖాన్, కార్యదర్శులు సుల్తాన్, కరీముల్లా, కమిటీ సభ్యులుగా మహబూబ్‌బాషా, ఖాజాహుసేన్, షఫీవుల్లా, ఇస్మాయిల్, జాఫర్, అబ్దుల్ రహిమాన్ ఎన్నికయ్యారు.

సర్వేలు సక్రమంగా నిర్వహించాలి


లబ్ధిదారుకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎంపీడీఓ

రుద్రవరం: నిర్దేశించిన సర్వేలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని చిన్నకంబలూరు గ్రామ సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ముందుగా సచివాలయ నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి మనమిత్ర, వర్క్ ఫ్రం హోం, హౌస్ హోల్డ్ ,ఆధార్ లేని పిల్లల వివరాలు తది తర సర్వేలను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కోటకొండ గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 6,159 మంది పింఛన్‌దారులు ఉండగా 5,592 మందికి పింఛన్ సొమ్ము అందజేసినట్లు ఆమె తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం


కార్మికులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): స్థానిక బసవతారక నగర్ సచివాలయ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు మేడే సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, సేవా స్తంభ్ రాష్ట్ర కార్యదర్శి సత్యం, రమేష్, సాంబశివుడు, రోజక్క పాల్గొని పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. పారిశుద్ధ కార్మికులు చేస్తున్న సామాజిక సేవతోనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటున్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉయ్యాలవాడ: పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.5,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. పుచ్చకాయలపల్లె, సంజామల మండలంలోని అక్కంపల్లె గ్రామానికి చెందిన వారు ముళ్ల పొదల్లో పేకాట ఆడుతుండడంతో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ నంద్యాల మండల ఉపాధ్యక్షులుగా దూదేకుల ఉస్సేన్, దేరెడ్డి బాలచంద్రారెడ్డిని నియమించారు. వీరితో పాటు జనరల్ సెక్రెటరీలుగా బత్తుల రవికుమార్‌రెడ్డి, నాగనందిరెడ్డి, తీగూరు సుబ్బారెడ్డి, సెక్రెటరీలుగా జూపల్లి మల్లిఖార్జునరెడ్డి, మునిశంకర్‌రెడ్డి, రామసుబ్బయ్య, గోపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి నియమితులయ్యారు.

గోస్పాడు మండల కమిటీ

గోస్పాడు మండలానికి సంబంధించి ఉపాధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, జనరల్ సెక్రెటరీలుగా వెంకటేశ్వరరెడ్డి, భాస్కరరెడ్డి, వెంకటరామిరెడ్డి, క్రిష్టారెడ్డిలతో పాటు సెక్రెటరీలుగా నారాయణ, శంకర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్, కాంతారెడ్డి, లోకేష్‌బాబులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): మే డేను పురస్కరించుకొని పట్టణంలోని టీవీ టెక్నిషియన్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక శ్రీనివాస సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కన్నయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే డే రోజు మజ్జిగ పంపిణీని చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వేసవి తాపం ఉపశమనం కోసం దాదాపుగా 500 మందికి పైగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. వెంకటేశ్వర్‌రెడ్డి, జయపాల్, మహబూబ్ బాషా, వీరారెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

ఆటాడుకుందాం రా..!

- జిల్లాలో ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు
- నెల పాటు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఒక్కో శిబిరానికి రూ.7వేలు కేటాయించిన శాప్
- 50 శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ


నంద్యాలలో ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం


ఇండోర్ స్టేడియంలో తైక్వాండో శిక్షణ


బేతంచెర్లలో వాలీబాల్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): వేసవి వచ్చిందంటే చాలు పిల్లలకు ఆటలు గుర్తుకొస్తాయి. ఏడాదంతా పుస్తకాలు, ప్రాజెక్టులు, పరీక్షలు అంటూ ఒత్తిడిలో ఉన్న విద్యార్థులు వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత సేదతీరుతుంటారు. వేసవి సెలవుల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో గడపడాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. కొందరు చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతక్కుపోతున్నారు. వారి దృష్టిని మళ్లించి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు శాప్ ఆధ్వర్యంలో ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. మే 1 నుంచి 31 వరకు జిల్లాలోని 50 నిర్ణీత ప్రాంతాల్లో శిక్షణ ఇస్తారు. ఇందు కోసం ఒక్కో శిబిరానికి రూ.7 వేలు చొప్పున కేటాయించారు. ఈ మొత్తంలో శిక్షకుడికి రూ.2వేలు ఇవ్వనుండగా.. మిగిలిన రూ.5 వేలతో క్రీడా సామగ్రి, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించనున్నారు.

నెల పాటు నిర్వహణ

జిల్లాలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వేలాదిగా ఉన్నారు. వారిలో ఔత్సాహికులైన బాల బాలికలకు నెల పాటు పలు ఆటల్లో శిక్షణ ఇవ్వాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్ణయించింది. ఇందు కోసం శిక్షకులను ఎంపిక చేసింది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తారు. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండే విద్యార్థులు వారికి ఇష్టమైన ఆటలు ఆడి నెల రోజుల పాటు నైపుణ్యం సాధించవచ్చు.



50 శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేశాం. జిల్లా మొత్తంగా 50 శిబిరాలు ఏర్పాటు చేశాం. ఈ మేరకు క్రీడాసంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాం. ఎంపిక చేసిన ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఒక్కో శిబిరానికి రూ.7వేలు మంజూరైంది. –రాజు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, నంద్యాల

వివిధ అంశాల్లో తర్ఫీదు

ఓ వైపు చదువుతో పాటు మరో వైపు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఏడాది వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా 16 ఏళ్లలోపు బాల, బాలికలకు అవకాశం కల్పిస్తారు. అర్చరీ, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్ బాల్, ఫెన్సింగ్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, కరాటే, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, వాలీబాల్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

యాప్‌లో వివరాల నమోదు

శిబిరాలు పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో శాప్ ప్రత్యేకంగా క్రీడా యాప్‌ను రూపొందించింది. ఆ యాప్‌లో సమగ్ర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని ఇప్పటికే అధికారులకు సూచించారు. శిబిరాలు పెట్టే ప్రదేశం, క్రీడాంశం, విద్యార్థులు, శిక్షకుల వివరాలు, గౌరవ వేతనం, ఉపకరణాల పంపిణీ, ప్రశంసా పత్రాల అందజేత తదితర వివరాలను కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే ఆ వివరాలు కూడా పొందుపరచవచ్చు.

క్రీడా పేరు	శిక్షణా శిబిరాలు
ఆర్చరీ	నంద్యాల
అథ్లెటిక్స్	నందికొట్కూరు
బ్యాడ్మింటన్	ఆళ్లగడ్డ
బాల్ బ్యాడ్మింటన్	ఆత్మకూరు
బాల్ బ్యాడ్మింటన్	పెద్ద చింతకుంట్ల
బాల్ బ్యాడ్మింటన్	పేరాయిపల్లి
బాల్ బ్యాడ్మింటన్	అహోబిలం
బాక్సింగ్	బనగానపల్లె, ఆత్మకూరు, నంద్యాల
చెస్	నంద్యాల
ఫుట్‌బాల్	నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు
హ్యాండ్ బాల్	ఆళ్లగడ్డ, దొర్నిపాడు, సంజామల
కబడ్డీ	నందికొట్కూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ
ఖోఖో	ఆత్మకూరు
సెపక్‌తక్రా	ఆళ్లగడ్డ
సాఫ్ట్‌బాల్	ఆళ్లగడ్డ, నంద్యాల, సంజామల
తైక్వాండో	నంద్యాల, ఆత్మకూరు, చాబోలు, ఆళ్లగడ్డ,
వాలీబాల్	బనగానపల్లె, ఆత్మకూరు, నున్నిపెంట, కోవెలకుంట్ల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ
యోగా	కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, నంద్యాల

భూసార పరీక్షలతో ఎంతో ప్రయోజనం


మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

గోస్పాడు: భూసార పరీక్షలు చేయించడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి అన్నారు. మండలంలోని సాంబవరం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి, సిబ్బంది గురువారం మట్టి నమూనా సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. భూసార పరీక్షల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లోని నత్రజని, భాస్వరం, పొటాష్ లభ్యత తెలుసుకోవచ్చని తెలిపారు. తద్వారా తగిన మోతాదులో ఎరువులు, పురుగుమందులు వినియోగించవచ్చని చెప్పారు. ప్రస్తుతం మండలంలో రబీ పంట కోతలు ముగిశాయని.. వేసవిలో భూములు ఖాళీగా ఉన్నందున భూసార పరీక్షలకు సరైన సమయమన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. మట్టి పరీక్షలు చేయించుకోవాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఏఈఓ రామకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఝాన్సీ పాల్గొన్నారు.

వీడని గాలీవాన..


ఎల్లావత్తుల సమీపంలో ధాన్యం తడవకుండా కుప్పగా చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలో రెండు రోజులుగా సాయంత్రం అయ్యే సరికి భారీగా గాలులు వీచడంతో పాటు వర్షం కురుస్తోంది. గురువారం సాయంత్రం మండల కేంద్రమైన రుద్రవరం, కొండమాయపల్లె, వెలగలపల్లె, చిన్నకంబలూరు, బి.నాగిరెడ్డిపల్లె, పేరూరు, చందలూరు, మందలూరు తదితర గ్రామాల పరిధిలో భారీగా గాలులు వీస్తూ వర్షం కురిసింది. ప్రస్తుతం రబీలో సాగు చేసిన వరి కోతలు చివరి దశలో ఉన్నాయి.ఇప్పటికే కోతలు కోయించిన వారు ధాన్యాన్ని ఆర్ అండ్‌బీ రోడ్లు, బయలు ప్రదేశాల్లో ఆరబోసుకున్నారు. సాయంత్రం అయ్యే సరికి గాలి వాన వస్తుండటంతో ఆరబోసిన ధాన్యం తడిసిపోతోందని అన్నదాతలు లబోదిబోమంటున్నారు. గింజలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

ఇక కొండనే దిక్కు!


జీవాలను కొండకు తరలిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: గొర్రెల పెంపకందారులు ఏటా వేసవి పంటల కోత అనంతరం రూ.లక్షల్లో పుల్లరి చెల్లించి జీవాలను తీసుకొస్తారు. మండలంలో పత్తి, పప్పుశనగ అధికంగా వేస్తారు. వీటిని గొర్రెలు, మేకలు ఇష్టంగా మేస్తాయి. దీంతో జమ్మలమడుగు, ఆవుకు వంటి కొండ ప్రాంతాలకు చెందిన గొర్రెల కాపరులు ఇక్కడి వలస వస్తారు. ప్రస్తుతం ఇక్కడ మేత అయిపోవడంతో కొండకు తిరుగు పయనం అయ్యారు. తొలకరి వర్షాలు కురుస్తున్నందున కొండ పచ్చదనం సంతరించుకుంటుండటంతో మేత దొరకుతుందని కాపరులు పేర్కొంటున్నారు.


శిక్షణ పొందుతున్న బాలికలు

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న రాష్ట్ర సేవికా సమితి సభ్యురాలు రాధిక

నంద్యాల(వ్యవసాయం): బాలికలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని రాష్ట్ర సేవికా సమితి కార్యవర్గ సభ్యురాలు రాధిక, విషాలాక్షి అన్నారు. గురువారం స్థానిక గురురాజ పాఠశాలలో నిర్వహిస్తున్న సేవికా సమితి ప్రారంభిక్ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విపత్కర పరిస్థితలను ఎదుర్కోవడానికి బాలికలకు కరాటే, కత్తి, కర్రసాము, యోగా, ధ్యానం తదితర వాటిపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణ తీసుకున్న వారు తమ స్వగ్రామంలో ఐదుగురు బాలికలకు శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దాదాపుగా 150మందికి పైగా బాలికలు శిక్షణ తీసుకున్నారు.

రోటావేటర్‌తో సులువుగా..


దొర్నిపాడులో జొన్నకొయ్యలను రోటావేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. ఇటీవల తొలకరి వర్షాలు పలకరిస్తుండంతో సేద్యం పనులకు అనువుగా ఉంటుంది. రోటావేటర్ వినియోగం పెరగడంతో రైతులకు వ్యవసాయ పనులు సులభంగా మారాయి. పత్తి, మిరప, జొన్న పంటల అవశేషాలను తొలగించేందుకు గతంలో రైతులు చాలా ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రొటావేటర్ మట్టిని తిప్పేయడం, విచ్ఛిన్నం చేయడం ద్వారా నేలకు పోషకాలు అందుబాటులోకి వస్తాయి. అంతేగాక పంట అవశేషాలు మొత్తం నేలలో కలిసి పోవడం వల్ల పంట దిగుబడిని పెంచుతాయని రైతులు పేర్కొంటున్నారు. కలుపును కూడా తొలగించడానికి రోటావేటర్లు సహాయపడుతుండటంతో రోటవేటర్ల వినియోగం పెరిగింది.

వాడవాడలా మేడే వేడుకలు


సీపీఎం కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు


మున్సిపల్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నిసా


న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం వద్ద..


మాట్లాడుతున్న జడ్జి అమ్మన్నరాజు


గోస్పాడులో జెండా ఆవిష్కరణ


సీఐటీయూ ఆధ్వర్యంలో..

నంద్యాల(న్యూటౌన్): కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని.. కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించేంత వరకు పోరాటాలు చేస్తామని సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మేడే వేడుకలను గురువారం నంద్యాలలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు.

- స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, ప్రసాద్ పతాకావిష్కరణ చేశారు.
- ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయం వద్ద ఉద్యోగుల సంఘం నాయకులు హరిప్రియ, రమేష్‌బాబు ఆధ్వర్యంలో జెండా వందనం చేశారు.
- సీపీఎం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రమేష్‌కుమార్, నాగరాజు మాట్లాడుతూ..అనేక మంది కార్మికుల ప్రాణ త్యాగ ఫలితంగా సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి అందరూ ఐకమత్యంగా పోరాటం చేయాలన్నారు.
- మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక చట్టాల పరిరక్షణ కోసం కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.శంకర్, చౌడప్ప పిలుపునిచ్చారు.
- సీపీఐ కార్యాలయం, ఆటోనగర్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బొమ్మలసత్రం వద్ద సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, భవన నిర్మాణ కార్మిక సంఘం వద్ద ఏఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, సంజీవనగర్ గేటు వద్ద సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, ఆర్టీసీ బస్టాండ్ వద్ద శ్రీనివాసులు జెండాను ఆవిష్కరించారు.
- గోస్పాడు: మండల కేంద్రంలో జరిగిన మేడే వేడుకల్లో నాయకులు గోకారి, చెన్నయ్య, శివలక్ష్మి, హుస్సేన్, శారదమ్మ, రామ రుక్మినమ్మ పాల్గొన్నారు.
- నంద్యాల(వ్యవసాయం): కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మూడో అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక గాంధీచౌక్‌లోని లారీ హమాలీ యూనియన్ కార్యాలయంలో హమాలీలు, కార్మికులకు చట్టాలపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ నాయకులు హుసేన్‌బాషా, శ్రీనివాసమూర్తి, కృష్ణారెడ్డి, లారీ హమాలీ యూనియన్ కార్యదర్శి వెంకటలింగం పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): బీచ్ కబడ్డీ క్రీడాకారులకు గురువారం గురురాజ విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరి ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను పంపిణీ చేసినట్లు ఆ సంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పరస్పర సహకారంతో కేసుల పరిష్కారం


మాట్లాడుతున్న జడ్జి తంగమణి

నంద్యాల(వ్యవసాయం): బెంచ్‌కు, బార్‌కు పరస్పర సహకారం ఉండటం వల్ల కక్షిదారులకు త్వరితగతిన కేసులను పరిష్కారం చూపగలుగుతామని మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.తంగమణి అన్నారు. గురువారం బదిలీపై వచ్చిన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాగతం కార్యక్రమం నిర్వహించి, సత్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రభుదాసు, అధ్యక్షుడు హుసేన్‌బాషా, ముక్కెర కృష్ణారెడ్డి, రామచంద్రారావు, రఘుప్రకాష్, నెరవాటి అమర్నాథ్, ఖలీల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులకు నష్టం కలిగించొద్దు

- ఘనంగా కార్మిక దినోత్సవం
- రెపరెపలాడిన ఎర్రజెండా


మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు


రుద్రవరంలో జెండా ఎగురవేస్తున్న రామచంద్రుడు

ఆళ్లగడ్డ: ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే వేడుకలు గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మున్సిపల్ కమిషనర్ కిషోర్ అరుణ హాజరై పతాకాన్ని ఆవిష్కరించి కార్మికులకు సంఘీభావం తెలిపారు.

- రుద్రవరం: కార్మికుల హక్కులకు నష్టం కలిగించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన రుద్రవరం,కే.కొత్తూరు గ్రామాల్లో గురువారం కార్మిక దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు లేక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నిరుద్యోగం,పేదరికం, విద్య,వైద్యం,కూడు,గుడ్డ వంటి సౌకర్యాలు అందక ప్రజలు ఉద్యమ బాట పడుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని గాలికొదిలేసి ప్రజల దృష్టి మరల్చేందుకు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు.సంఘం జిల్లా నాయకులు శంకర్,ఆటో యూనియన్ నాయకులు గంగయ్య,ముసలయ్య,లాలు, దేవరాజ్,వాసు,తిరమలయ్య పాల్గొన్నారు.
- చాగలమర్రి: స్థానిక గ్రామ చావిడి వద్ద మండల సీఐటీయూ నాయకుడు గుత్తి నరసింహులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఒంటెద్దు బండ్ల హమాలీలు పాల్గొన్నారు.

సరదా సమయం..


ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

ఉయ్యాలవాడ : వేసవి సెలువులు వచ్చాయంటే చాలు.. విద్యార్థుల్లో ఎక్కడా లేని ఆనందం ఉట్టిపడుతుంది. ఏడాది పాటు తీరిక లేకుండా పుస్తకాలతో కుస్తీ పట్టిన వారికి.. విరామ సమయం లభించడంతో స్నేహితులతో సరదాగా గడుపుతున్నారు. అధిక శాతం మంది ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ క్రీడల్లో పాల్గొంటున్నారు. అందుబాటులోనున్న మైదనాల్లో తోటి విద్యార్థులతో ఎండను సైతం లెక్కచేయకుండా ఆటల్లో మునిగిపోతున్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో పలువురు విద్యార్థులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ తదితర ఆటల్లో నిమగ్నమయ్యారు.